27

# అపొస్తలుల తదుపరి చరిత్ర

## I. పౌలు యొక్క తదుపరి చరిత్ర.

**1. తన విడుదల; తరువాత చరిత్ర.** – తొలి రోమా బంధనంనుండి పౌలు విడిపించబడ్డాడనేది అతని నిరంతర విశ్వాసం మీద అధారపడి ఉంది (ఫిలిప్పీ. 1:25, 26; 2:24; ఫిలే. 22), సూచిత విషయాలవలనను, సందర్భాలవలనను గత చరిత్రలో సరిపడని ప్రయాణాలవలనను, సార్వత్రిక పరంపరవల్లను అది స్థిరపరచబడుతుంది.

1 తిమోతి, తీతు పత్రికలవలన, అతడు ఎఫెసును తిరిగి సందర్శించినట్టును, క్రేతులో సంచరించినట్టును, మరొకమారు మాసిదోనియను, గ్రీసును దర్శించినట్టును గ్రహించ గలుగుతున్నాం. ఈ కాలంలో అతడు తిమోతికి మొదటి పత్రిక, తీతు పత్రికను వ్రాశాడు.

**2. అతని చివరి బంధనం – మరణం.** – పౌలు క్రీ.శ 63లో విడుదల చేయబడ్డాడు. రోములో గొప్ప అగ్ని ప్రమాదం తరువాత సంవత్సరం జరిగింది. తన మీదనున్న అనుమానాన్ని పోగొట్టుకొనడానికి, నీరో చక్రవర్తి క్రైస్తవులను నిందితులనుగా చేశాడు. రోమునుండి కొంత దూరంలో ఉన్న పౌలు తన ప్రయాసలను కొనసాగిస్తున్నాడు; అయితే కడకు అతడు బంధింపబడి రోముకు తేబడ్డాడు. నిప్పుపెట్టేలా జనులను రేపినట్టు అతనిపై నేరం మోపబడే అవకాశం ఉంది. అతని రెండవ సారి బంధకాలు మొదటి వాటికంటే కఠినంగా ఉన్నాయి. చెరసాలలోనుండి, త్వరలో చంపబడబోయేదాన్ని ఎదురు చూచి, అతడు తన కడపటి రచనయైన – 2 తిమోతిని వ్రాశాడు. కొన్ని సందర్భాలలో తన పాత స్నేహితులు తన్ను విడిచి వెళ్లినదే తన హృదయాన్ని ఎక్కువగా బాధించింది. కడవరకు లూకా అతనితో ఉన్నాడు. రెండవ తిమోతిని ముగించేటప్పుడు లేఖనాల్లోనుండి వృద్ధుడైన అపొస్తలుని మీద చివరి వెలుగు పడుతుంది. అయితే, నమ్మదగిన పరంపరనుబట్టి, క్రీ.శ 68లో అతడు శిక్ష విధింపబడి చంపబడినట్టు తెలుస్తుంది. క్రైస్తవులమీద తరచుగా విధింపబడే జాగు చేయబడిన మరణంనుండి పౌలుయొక్క రోమా పౌరత్వం అతన్ని మినహాయించింది. రోమా ప్రాకారానికి వెలుపల అతడు శిరచ్ఛేదనం చేయబడి యుండవచ్చు. అన్యజనులకు గొప్ప అపొస్తలుడైన పౌలు, తన జీవితము, రచనలు తన వెనుక వచ్చే వారికి గొప్ప ఆస్తిగా వదలి వెళ్లాడు.

## II. ఇతర అపొస్తలుల తదుపరి చరిత్ర.

**1. పేతురు యొక్క చివరి క్షణిక దర్శనం.** – పేతురుకు కార్య గ్రంథంలో చివరి

రిఫరెన్సు అపొస్తలుల సభలోనిదే (అపొ. 15:7–11). దీనికి రమారమి ఆరు సంవత్సరాల తరువాత వ్రాయబడిన గలతీ పత్రికలో, అంతియొకయ వద్ద పేతురు అపరాధిగా తీర్చబడ్డట్టు పౌలు సూచించాడు (గలతీ. 2:9–14). ఈ సంఘటన ఆ సభ అనంతరం త్వరలోనే సంభవించియుండవచ్చు, పౌలు రెండవ సువార్త ప్రయాణానికి ముందే. క్రొత్త నిబంధనలో పేతురునకు కడపటి చారిత్రక సూచిత విషయం యిదే. అయితే అతని రచనలు రెండు మనకు లభిస్తున్నాయి. మొదటిది బబులోనునుండి వ్రాసింది, రోముకు అది అలంకారాత్మకమైన పదమై ఉండవచ్చు, మరియు అది చిన్న ఆసియాలో ఉన్న క్రైస్తవులకు వ్రాయబడింది (1 పేతురు 1:1; 5:13). సీల, మార్కులను సూచించడాన్నిబట్టి, పౌలు రోమానందలి మొదటి రెండు చెరల మధ్య వ్రాసియుండవచ్చు. పౌలు రచనలతో తనకు పరిచయమున్నట్టు తన రెండవ పత్రిక సూచిస్తుంది (2 పేతురు 3:15, 16), మరియు పేతురు తన విశ్వాసాన్నిబట్టి చంపబడడం (2 పేతురు 1:13–15ను; యోహాను 21:18, 19తో పోల్చి చూడు). తొలి క్రైస్తవ రచయితల ప్రకారం, పౌలు యొక్క మరణానంతరం కొద్ది కాలానికి ఈ మరణం జరిగినట్టు తెలుస్తుంది. పేతురు రోమా పౌరత్వం హక్కులను అనుభవించినవాడు కాదు, గనుక అతడు తన బోధకుని వలెనే సిలువపై మృతి పొందాడు. పారంపర్యాన్ని నమ్మినట్టయితే, తన బోధకునివలె చనిపోడానికి అతడు తగినవాడు కాదని గనుక తనను తలక్రిందులుగా సిలువ వేయుమని బతిమాలుకున్నాడట.

**2. యోహాను తదుపరి జీవితం.** – కార్య గ్రంథం చరిత్రనుండి యోహాను మొదటిలోనే తొలిగింపబడ్డాడు. సమరయలోని ఫిలిప్పు పనితో అతడు చివరిగా కనిపిస్తాడు (అపొ. 8:14, 25). కార్య గ్రంథంలోని సభలో అతడు పేర్కొనబడలేదు (అపొ. 15); కాని ఆ సందర్భంలో పౌలు గలతీయులకు వ్రాస్తూ అతని ప్రస్తావించాడు (గలతీ. 2:9). సువార్త ప్రచారంలో ప్రధానమైన పాత్రగా యోహాను చిత్రింపబడకపోయినా, పౌలు తరువాత అపొస్తులులలో అతని రచనలే ఎక్కువగా ఉన్నాయి. చివరి సువార్త రచన, మూడు పత్రికలు, మరియు ప్రకటన గ్రంథము అతని కలంనుండి వచ్చినవే. అతని చివరి దినాలు చిన్న ఆసియాలో, ఎఫెసు తన పనికి కేంద్రంగా ఉంచుకొని గడిపియుండవచ్చు. ఒక సంవత్సరం అతడు పత్మాసులో ద్వీపాంతర ఖైదీగా చేయబడ్డాడు (ప్రకటన 1:19), అక్కడ అతడు ప్రకటన గ్రంథాన్ని వ్రాశాడు. ట్రేజన్ చక్రవర్తి యొక్క పరిపాలనా కాలంవరకు (క్రీ.శ. 98–117) జీవించి, శతాబ్దం ముగిసే ప్రాంతంలో మరణించాడు. తన మరణాన్ని రక్తంతో ముద్రించని ఏకైక అపొస్తలుడు అతడే అయ్యుండవచ్చు.

**3. ఇతర అపొస్తలులు – ముగింపు.** – మనం యింతకుముందే చూచినట్టు (అపొ. 12:1, 2) యోహాను సహోదరుడైన యాకోబు తొలిగా తన విశ్వాసమునుబట్టి హతసాక్షి యయ్యాడు. తక్కిన అపొస్తలులను గురించి క్రొత్త నిబంధన యింతకంటే ఎక్కువ తెలుపుతుందనేది అనిశ్చయం. రెండు పత్రికలు: యాకోబు, యూదా అనేవి మిగిలి పోయాయి. వాటి లేఖకుల యొక్క అభేదము స్థిరపరచబడని ప్రశ్నలుగా ఉన్నాయి, అయినా అధికమధికమైన అభిప్రాయం ప్రభువు యొక్క సహోదరులను ఆదరిస్తుంది (ఫేవర్ చేస్తుంది). ఆయా అపొస్తలులు ఆయా దేశాలలో సువార్తకు వెళ్లినట్టును, యోహాను మినహా తక్కిన వారందరు హతసాక్షులైనట్టునూ పారంపర్యం తెలుపుతుంది.

అపొస్తలులలో గొప్పవారనబడేవారి కడపటి ప్రయాసలు తెలియబడక పోవడం అంత ప్రాముఖ్యమేమీ కాదు. అపొస్తలుల చరిత్రలో వ్యక్తిగతమైన విషయాలు అప్రాముఖ్యం. మనుష్యుల చుట్టు కొంత ఆసక్తి పెరిగే మాట వాస్తవమే; అయితే అత్యధికమైన ఆసక్తి నిరంతరం విస్తరించే పనులమీద కేంద్రీకరిస్తుంది. సువార్త చరిత్రలో, దానికి భిన్నంగా, వ్యక్తిగతమైన భాగం ఎక్కువ ప్రాధాన్యతను పొందుతుంది. ఆసక్తి వ్యక్తియందుంటుంది. ఆయన పనికంటే, ఆయన ఏ మాట కంటెను నిరంతరం క్రీస్తు గొప్పవాడైయున్నాడు. ఆయన భూమిమీదనుండి వెడలిపోవు విషయంలో అస్పష్టతకు తావు లేకుండా చేయబడింది. ఆయన సువార్తలకు మాత్రమే కాదు, కేవలం క్రొత్త నిబంధనకు మాత్రమే కాదు, బైబిలు కథనమంతటికి ఆయన ప్రధాన పాత్రయై ఉన్నారు. ఆయన లేకుంటే, కట్టడమంతా నిరీక్షణలేని శిథిలాలుగా కూలిపోతుంది; ఆయనతో అది అసమానమైన, శాశ్వతమైన సౌందర్య సౌధంగా నిలిచియుంటుంది.